క్లుప్తంగా

చెరువు తూముల పరిశీలన



జి.కొండూరు: వ్యవసాయ అవసరాల దృష్ట్యా సాగునీరు సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు తూముల వద్ద కొత్త గేర్‌బాక్సులను ఇటీవల అమర్చారు. ఈ క్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, సర్పంచి మండల అరుణ స్థానిక రైతులతో కలిసి చెరువును శుక్రవారం పరిశీలించారు. చెరువునీటిని వృథా చేయకుండా రైతులు సద్వినియోగపరుచుకోవాలని ఎంపీపీ సూచించారు. రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



చిలుకూరు(ఇబ్రహీంపట్నం): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మసూద్ బిన్ ఖలీల్ అన్నారు. మండలంలోని చిలుకూరులో సీజనల్ వ్యాధులపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం తాగునీరు, ఆహారం కలుషితం అవుతాయని కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. సున్నం బ్లీచింగ్ పౌండర్ చల్లాలన్నారు. దోమల నివారణకు దోమ తెరలు వాడాలని తెలిపారు. జ్వరాల భారిన పడితే ఆరోగ్య ఉప కేంద్రంలో సమాచారం ఇచ్చి, పీహెచ్‌సీకి రావాలన్నారు. అవసరమైన వారికి రక్త నమూనాలు సేకరించి వైద్యపరీక్షలు చేస్తామని చెప్పారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఇబ్రహీంపట్నం: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్టీటీపీఎస్ మెయిన్ గేటు వద్ద ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై యాజమాన్యం నుంచి ఎటువంటి పరిష్కారం లేనందున దశల వారీగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరణ, పాతపెన్షన్ విధానం, అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీ తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. వివిధ యూనియన్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, పి.శ్రీనివాసరావు, అన్నే శ్రీనివాస్‌కుమార్, ఆర్.శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పంపిణీ



రెడ్డిగూడెం: మండల వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు గొర్రెలు, మేకలు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ యూనిట్లను వినియోగించుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన పొందాలన్నారు. వివిధ గ్రామాల నుంచి 24 మంది లబ్ధిదారులకు ఒక్కొక్క యూనిట్‌లో 6 గొర్రెలు, బీమా, మెడికల్ కిట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మల్లాది రాణి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, రైతు సలహా మండలి అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వరరెడ్డి, రామినేని వీరస్వామినాయుడు,ఎంపీడీఓ, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, సిబ్బంది, సీసీలు పాల్గొన్నారు.

జైలు జీవితం మార్పు తీసుకురావాలి



నూజివీడు: క్షణికావేశంలో తప్పు చేసినా జైలు జీవితం మార్పు తీసుకురావాలని జూనియర్ సివిల్ జడ్జి ఎల్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సబ్‌జైలును శుక్రవారం ఆయన సందర్శించి రిమాండ్ ఖైదీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు నేరాల్లో పాలు పంచుకోవడం వల్ల వారి భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుందన్నారు. యువశక్తి దేశానికి ఉపయోగపడాలే గాని నేరాలు చేసి జైలు గోడల మధ్య నిర్వీర్యం కాకూడదన్నారు. జైలు జీవితం అనుభవించిన వారు తమ ఆలోచనా విధానం మార్చుకుని మంచి నడవడికతో కొత్త జీవితాన్ని ప్రారంభించాలన్నారు. అనంతరం ఖైదీలకు కల్పిస్తున్నసదుపాయాలను, భోజనం తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. సబ్‌జైల్ సూపరింటెండెంట్ గంగినేని ప్రసాద్, న్యాయవాది జాన్‌బాబు పాల్గొన్నారు.

మనుగడకు మొక్కలే ఆధారం

డీపీవో సునీత



గుంటుపల్లిలో మొక్కలు నాటిన డీపీవో సునీత, ఎంపీపీ జోత్స్న తదితరులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): మానవుల మనుగడకు మొక్కలు జీవనాధారం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లా పంచాయతీ ఇన్‌చార్జ్ అధికారి జె.సునీతతో కలసి ఎంపీపీ పాలడుగు జోత్స్న గుంటుపల్లిలో శుక్రవారం మొక్కలు నాటారు. కాలుష్యం నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. డీఎల్‌పీవో బి.శ్రీనివాసరావు, సర్పంచి భుక్యా కవిత, ఎంపీడీవో రామకృష్ణనాయక్, పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు, పాలడుగు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. జూపూడిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి కాకి దేవమాత, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, ఎంపీడీవో రామకృష్ణనాయక్, ఈవోపీఆర్డీ మనోజ్, బి.బాలాజీ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు మొక్కలు నాటారు.

జి.కొండూరు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా మనమే చేపట్టాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జీ కొండూరులో ఎంపీపీ మొక్కలు నాటారు. చెవుటూరు గ్రామంలో వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు మొక్కలను నాటారు. కార్యక్రమంలో జి.కొండూరు సర్పంచ్ మండల అరుణ, ఎంపీడీఓ అనూరాధ, అధికారులు పాల్గొన్నారు.

కనుమూరు(గంపలగూడెం): మండలంలోని కనుమూరు సచివాలయ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో 400 నీడ నిచ్చే పండ్ల మొక్కలను ఉపాధి హామీ కూలీల ద్వారా నాటిస్తామన్నారు. సర్పంచ్ మందా మారేశ్వరకి, సొసైటీ అధ్యక్షుడు చెరుకు భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వజ్రాల శ్రీనివాసరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ వేల్పుల వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ పథకం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరం: పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎంపీపీ ఇస్లావత్ ప్రస్సన్నరాణిస్వామి తెలిపారు. మైలవరం శివారులో ఎంపీడీఓ లక్ష్మీ కుమారి, ప్రజాప్రతినిధులు, అటవీశాఖ అధికారులతో కలసి ప్రపంచ నెచర్ కన్జర్వేషన్ డే కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడి భవిష్యత్తు తరాలకు అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.



చెవుటూరులో మొక్క నాటి నీరు పోస్తున్న వైస్ ఎంపీపీ సుబ్బారావు, ఎంపీడీఓ



కనుమూరులో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ పిచ్చిరెడ్డి

రెడ్డిగూడెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని రెడ్డిగూడెంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ మొక్కలు, జంతువులను రక్షించడమే ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం ప్రధాన లక్ష్యం అన్నారు. మైలవరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు రెడ్డిగూడెం మండలం కొత్తరెడ్డిగూడెం ఎన్ఎస్‌పీ కాల్వ నందు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య, సర్పంచ్ మల్లాది రాణి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, పీఏసీఎస్ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్, రైతు సలహా మండలి అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వరరావు, రామినేని వీరస్వామినాయుడు, ఎంపీడీఓ విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏ.కొండూరు: ప్రతి ఒక్కరూ ప్రకృతిని పరిరక్షించాలని ఎంపీడీఓ కేఏఎస్ రవికాంత్ పేర్కొన్నారు. మండలంలోని చీమలపాడు గ్రామంలో శుక్రవారం ప్రపంచ ప్రకృతి పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని కాపాడటం మన బాధ్యత అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోలా నరసింహారావు, ఏపీఓ రామారావు, జి.రాధిక పలువురు పాల్గొన్నారు



రెడ్డిగూడెంలో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

సమన్వయంతో అభివృద్ధి చేద్దాం

మున్సిపల్ సమావేశంలో చైర్‌పర్సన్ త్రివేణిదుర్గ



నూజివీడు: మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్‌పర్సన్ త్రివేణిదుర్గ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో రోడ్లకు గ్రావెల్‌నైనా తోలి ఇబ్బందులను తొలగించాలన్నారు. నిధులు అందుబాటులో లేవన్న విషయమై కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. కాంట్రాక్టు కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్ మూడు నెలలుగా జీతాలు ఇవ్వాలని ప్రస్తుతం ఒక నెలైనా జీతం ఇచ్చేలా చూడాలన్నారు. 32వ వార్డు కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ వేసవి కాలం ముందు నుంచి డ్రెయినేజీల్లో పేరుకున్న పూడికను తొలగించాలని ప్రతి సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువస్తున్నా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని, ఇప్పుడు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. 28వ వార్డు కౌన్సిలర్ నడకుదురు గిరీష్ మాట్లాడుతూ వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్తలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. డీఈ దాస్యం లక్ష్మీనారాయణ బదులిస్తూ సోమవారం నుంచి వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకంటామన్నారు. ఈ సమావేశంలో కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, వైస్‌చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మేనేజర్ మనోజ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే సురక్ష



గొల్లపల్లిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచి వెంకటేశ్వరమ్మ తదితరులు



మైలవరంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ ప్రసన్నరాణి, తదితరులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి సచివాలయం -1 పరిధిలో శుక్రవారం సర్పంచి బొకినాల వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు ఎవరికైనా రాకపోతే ఈ కార్యక్రమంలో అర్జీలను అందించినట్లయితే అధికారులు పరిష్కరిస్తారన్నారు. స్థానిక లబ్ధిదారులకు 174 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీటీసీ తటకులూరి రామయ్య, అధికారులు, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: స్థానిక సచివాలయం–1లో శుక్రవారం సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి అధ్యక్షతన జగనన్న సురక్షకార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రసన్నరాణిస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఎస్ తిరుపతిరావు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగులూరు అజాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. 1133 మందికి సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

నూజివీడు: రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ఖరీఫ్ సీజన్‌లో ఎప్పటికప్పుడు రైతులు సాగు చేసిన పంటల వివరాలను జీయోఫెన్స్ ఆధారిత ఈ–క్రాప్ బుకింగ్‌ను నమోదు చేయాలని ఏడీఏ జీ విద్యాసాగర్ పేర్కొన్నారు. నూజివీడు డివిజన్‌లోని నాలుగు మండలాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి స్థానిక ఏడీఏ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఈ క్రాప్ బుకింగ్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగానికి అమలు చేసే పథకాలన్నీ ఈ–క్రాప్ బుకింగ్ అయితేనే వర్తిస్తున్నందున తప్పనిసరిగా రైతులందరూ తమ పంటలను ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకునేలా చైతన్యం చేయాలన్నారు. కౌలు రైతులు కూడా తాము సాగుచేసిన పంటలను బుకింగ్ చేయించుకునేలా చూడాలన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ విద్యాసాగర్

ఏవోలు ఆలూరు చాముండేశ్వరి, ఏవో టెక్నికల్ కే చిన్నసూరిబాబు, మధుమోహన్, చెన్నారావు, శివశంకర్‌లతో పాటు ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ ఏవో ఎం.ప్రియానంద రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రైతుభరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

గంపలగూడెం: మండలంలోని గుళ్లపూడి సొసైటీ సభ్యుడైన లింగాలకు చెందిన కాటన్ని వెంకటేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు బీమా కింద రూ.లక్ష మంజూరు కాగా శుక్రవారం మృతుని భార్య కాటన్ని సత్యవతికి ఆ మొత్తాన్ని గుళ్లపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు పోట్రు శశాంక్, సొసైటీ వద్ద అందజేశారు. దీనితో పాటు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు కూడా ఇచ్చారు. సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు, డైరెక్టర్ బి.శ్రీను పాల్గొన్నారు.

రుణాలను బ్యాంకుల్లోనే చెల్లించండి



ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలో లింకేజీ రుణాలు తీసుకున్న డ్వాక్రా సంఘాల సభ్యులు రుణ వాయిదాల సొమ్మును తిరిగి బ్యాంకుల్లోనే చెల్లించాలని, బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) పాయింట్ల వద్ద చెల్లించొద్దని ఏపీఎం బొలగాని రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం మండలంలోని వీవోఏలకు, సీసీలకు సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నర్సింగపాలెం, సగ్గూరు, తోటపల్లిలోని బీసీ పాయింట్ల నిర్వాహకులు అవకతవకలకు పాల్పడి దాదాపు రూ.1.08 కోట్లు స్వాహా చేసిన నేపథ్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు తప్పనిసరిగా బ్యాంకుల్లోనే చెల్లించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు ప్రతినెలా సమావేశాలు జరుపుకోవడంతో పాటు ఒక్కొక్క నెల ఒక సభ్యురాలు చొప్పున బ్యాంకుకు వెళ్లి జమ చేసేలా సీసీలు పర్యవేక్షించాలన్నారు. అలా చేయకుండా బీసీ పాయింట్‌లో కట్టించినట్‌లైతే వీవోఏపై, సీసీలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీపీఎం ఎల్ హెచ్ విజయకుమారి మాట్లాడుతూ ఈనెల 31న మ్యాంగో ప్రాసెసింగ్ కేంద్రంపై మామిడి రైతులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. స్త్రీనిధి, సీఐఎఫ్, హౌసింగ్ రుణాల గురించి చర్చించారు. యూబీఐ మేనేజర్ ఎం.జగన్‌మోహన్‌రావు, ఎఫ్ఓ కే అరవింద్, స్త్రీనిధి మేనేజర్ గోపీనాథ్, ఎల్‌సీ పీ ప్రసాద్, సీసీలు చాట్ల వెంకటరత్నం, లక్ష్మి, అరుణకుమారి, వీవోఏలు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి

తిరువూరు: నియోజకవర్గంలో మంజూరైన పనులను వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి కోరారు. విజయవాడలోని కలెక్టరు క్యాంపు కార్యాలయంలో కలెక్టరును కలిసి రక్షణనిధి పలు సమస్యలు వివరించారు. గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టిలేరుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలపై చర్యలు తీసుకోవాలని, ఆర్ అండ్ బీ రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైనందున అత్యవసర మరమ్మతులు చేయాలని కోరారు. జల్ జీవన్ మిషన్, జాతీయ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో చేయవలసిన పనులపై ప్రతిపాదనలు అందజేశారు.



కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే రక్షణనిధి

ఫిష్ మార్కెట్‌కు నిధులు కేటాయించాలని వినతి

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఫెర్రీలో నూతనంగా నిర్మిస్తున్న ఫిష్ మార్కెట్‌కు ఆధునికి మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజును వైఎస్సార్ సీపీ నాయకులుకోరారు. విజయవాడలోని కార్యాల యంలో బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లంకే దేవకుమారి ఆధ్వర్యతన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఇచ్చిన సిఫారసు లేఖను మంత్రికి శుక్రవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధికి ఫిష్ మార్కెట్ నిర్మించడం అభినందనీయం అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. లంకే అంకమోహనరావు, లంకే గోవింద రాజు, దయాకర్, పండు పాల్గొన్నారు.



మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కొండపల్లి అభివృద్ధికి సహకరించండి

సబ్‌కలెక్టర్ అదితిసింగ్‌కు కౌన్సిలర్ల వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధికి సహకరించాలని మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు సబ్‌కలెక్టర్, మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి అదితిసింగ్‌ను కోరారు. విజయవాడలోని ఆమె కార్యాలయంలో వినతిపత్రం శుక్రవారం అందజేశారు. అసంపూర్తిగా నిలిచిన అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. వర్షాలతో జలమయం అవుతున్న లోతట్టు ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని కోరారు. కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, బాడిశ నాగరాజకుమారి, మొగిలి దయాసాగర్, అడపా వెంకయ్యనాయుడు, నాయకులు ఎం.సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

పోలీసుల అదుపులో గంజాయి కేసు నిందితులు

మైలవరం: 1.5 కేజీల గంజాయి, 110 హషిష్ ఆయిల్ కలిగి ఉన్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా సీపీ టీకే రాణా ఆదేశాలపై రూరల్ డీసీపీ అజీతవేజండ్ల పర్యవేక్షణలో మైలవరం డివిజన్ ఏసీపీ ఎం.రమేష్ నేతృత్వంలో సీఐ డీకేఎన్ మోహన్‌రెడ్డి, ఎస్సై హరిప్రసాద్‌తమ సిబ్బందితో కలసి సర్కిల్‌పరిధిలో నిషేధిత మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యాకలపాలను నియంత్రించడానికి నిఘా ఏర్పాటుచేశారు. పీఎస్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో మైలవరం, కొత్తూరు తాడేపల్లి, చెవుటూరు, నూజివీడుకు చెందిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి గంజాయి, హషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 75వేలు ఉంటుందని ఏసీపీ రమేష్ తెలిపారు. విచారణలో గంజాయిని జాఫర్, వెంకట్, శివ అనే వారి ద్వారా పొందినట్లు ఏసీపీ వివరించారు. జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామానికి చెందిన పోన్న గౌతమ్, నూజివీడుకు చెందిన విద్యార్థి షేక్ అబ్దుల్ అజీమ్, జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామానికి చెందిన ఎం.మహేష్, కె.రామకృష్ణ, విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిగ్రామానికి చెందిన జి. చందును అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. 17 ఏళ్ల విద్యార్థిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గంజాయి సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 14500కు తెలియపర్చవచ్చన్నారు. చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారన్నారు. సీఐ మోహన్‌రెడ్డి, ఎస్సై హరిప్రసాద్, సిబ్బందిని కమిషనర్, డెప్యూటీ కమిషనర్ అభినందించినట్లు తెలిపారు.

అపార్ట్‌మెంట్‌లో ఆభరణాలు చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జన సంచారం ఉన్న సమయంలోనే గొల్లపూడి వన్‌సెంటర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. ఫ్లాట్ తాళం పగుల గొట్టి 205 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఎర్రమాని వెంకట సుబ్రహ్మణ్య బంగారు వాసవి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పని చేస్తున్నారు. రోజు ఉదయం 10 గంటలకు ఆఫీసుకు వెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటికి వస్తారు. శుక్రవారం ఆఫీసుకు వెళ్లిన సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌లోనే ఉంటున్న రామలక్ష్మీ అనే మహిళ బంగారు వాసవికి ఫోన్ చేసి ఇంటి తాళం పగుటగొట్టి ఉందని సమాచారం ఇచ్చింది. ఆమె ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందగా పడి ఉన్నాయి. బీరువాలోని బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీనిపై భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బీరువాలో పెట్టిన 85 గ్రాముల హారం సహా 205 గ్రాముల పలు బంగారు ఆభరణాలు కనిపించలేదన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గంపలగూడెం: ఎడతెరపి లేకుండా పడుతున్న వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పైర్లను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు తెలిపారు. పత్తి పైరులో ఎకరాకు 25 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్‌లను కలిపి వెదజల్లి అంతర కృషి చేయాలన్నారు. వేరుకుళ్లు తెగులు సోకకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను ఒక లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కలిపి చెట్ల మొదలు తడిచే విధంగా పిచికారీ చేయాలన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో జాగ్రత్తలు అవసరం



తిరువూరు: ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు మండలంలో చేపట్టిన ఓటర్ల జాబితాల పరిశీలన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారు సురేష్‌బాబు ఆదేశించారు. శుక్రవారం బీఎల్‌వోల సమావేశంలో ఆయన పలు సూచనలిచ్చారు. ఓటర్ల జాబితా సర్వేకు ఇంటింటికీ వెళ్లిన సమయంలో తప్పనిసరిగా ఇంటి నంబరు, ఓటరు పేరు, తండ్రి పేరు, చిరునామా సరిచూసుకోవాలని తెలిపారు. చిరునామా మార్పు, పుట్టిన తేదీ చేర్పు తదితర క్లయిములను స్వీకరించాలని ఆదేశించారు. దరఖాస్తులను ఎన్నికల సంఘం యాప్‌లో నమోదు చేయాలన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

విస్సన్నపేట: స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎం. రమేష్‌ను సస్పెండ్‌చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సి.వి రేణుక ఉత్తర్వులు జారీ చేసారని ఎంఈఓ–2 సుధాకర్ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి అయిఉండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యా కార్యక్రమానికి చెడ్డపేరు తీసుకు వచ్చేలాగ విద్యార్థులను వర్షంనీరు ఉన్నటువంటి తరగతి గదిలో కూర్చోబెట్టడం, దాన్ని మీడియాలో వచ్చేవిధంగా చేయటం అనేది ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో డీఈఓ సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ–2 తెలిపారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఏ.కొండూరు: ఈనెల 30న కార్మిక, కర్షక సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు అంబిరెడ్డి పిలుపునిచ్చారు. సదస్సు వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. విజయవాడలో జరిగే సదస్సులో జాతీయ నాయకులు పాల్గొంటారన్నారు. రైతు సంఘం నాయకులు బి.శ్రీను, ఎస్.రామకృష్ణారెడ్డి, యోహాన్, రామకృష్ణ, పి. ఆనందరావు, గొల్లమందల తండా సర్పంచ్ రాముడు, సీఐటీయూ మండల కార్యదర్శి జట్టి వెంకటేశ్వరరావు, పి.గోపి, భద్రం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి భద్రత కల్పించాలి

మైలవరం: మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు మెనూ చార్జీలు పెంచి ఉపాధి భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న కార్మిక సంఘం సన్నాహాక సమావేశం మైలవరం సీఐటీయూ కార్యాలయంలో అధ్యక్షురాలు బి.శేషమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. యాప్‌ల పేరుతో పర్యవేక్షణ చేసే ప్రభుత్వం బిల్లులను కూడా సకాలంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో వరలక్ష్మి, సంపతి, నీలవేణి, లీలా తదితరులు పాల్గొన్నారు.